మెరుగైన పాలన జగనన్నతోనే సాధ్యం

● ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి
● రుద్రవరంలో కొనసాగిన 'గడప గడపకు మన ప్రభుత్వం'



మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే గంగుల

రుద్రవరం: మెరుగైన పాలన జగనన్నతోనే సాధ్యమని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పేర్కొన్నారు. ఇందుకు ఇంతకు ముందెన్నడూ లేనట్లుగా మూడున్నరేళ్ల పాలనలో అర్హులందరికీ ఇంటికే పథకాలు అందజేయడం, అభివృద్ధి కార్యక్రమాలు, గ్రామంలోనే ప్రభుత్వ సేవలందించడం, రైతులకు భూసార పరీక్షల నుంచి దిగుబడి విక్రయించే వరకు అండగా ఉండటం, ప్రతి ఇంటికీ నాలుగు నుంచి ఎనిమిది పథకాలు అందజేయడం, మహిళలకు ఉన్నత పదవులతో పాటు ప్రతి అడుగులో చేయూతనిస్తున్న తీరే నిదర్శనమన్నారు. శుక్రవారం రుద్రవరంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కొనసాగించారు. సంక్షేమ పథకాల ద్వారా ప్రతి ఇంటికి రూ.లక్షల్లో లబ్ధి చేకూరిందని, ఇలాంటి పాలన ఇంతకు ముందు అందిందా అని స్థానికులను ప్రశ్నించగా.. లేదూ అని వారు ముక్తకంఠంతో సమాధానమిచ్చారు. పథకాలు, ప్రజారంజక పాలన కొనసాగాలంగే సీఎం వైఎస్ జగనన్నపై మీ ఆశీస్సులుండాలన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి బుక్‌లెట్ అందజేసి వర్తించిన పథకాలు, చేకూరిన లబ్ధిని వివరించారు. సమస్యలను తెలుసుకొని అక్కడికక్కడే అధికారులతో మాట్లాడి పరిష్కారం చూపాలని ఆదేశించారు. గ్రామంలో సచివాలయం, వైఎస్సార్ రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్, బల్క్ మిల్క్ సెంటర్, గోదాం, డిజిటల్ లైబ్రరీలను నిర్మించి సిబ్బందిని నియమించి సేవలు అందుబాటులోకి తేవడంతో గ్రామీణులకు పనుల నిమిత్తం మండల కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా పోయిందన్నారు. అగర్తల కాలనీలోనున్న మురుగు గుంతలో ఏళ్లుగా నీరు నిలిచి దుర్గంధం వెదజల్లుతోందని, పరిష్కారం చూపాలని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే..పంచాయతీ కార్యదర్శి మహమ్మద్ రఫీ, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు వెంకటరాముడు, ప్రమోద్‌కు పలు సూచనలు చేశారు. కాలనీకి ఇరువైపులా ఉన్న మురుగు కాల్వలను శుభ్రం చేయించాలని, జేసీబీతో కొత్తగా కాల్వ తీసి మురుగు నీరు నిల్వ ఉండకుండా దిగువకు వెళ్లేలా పనులు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆళ్లగడ్డ వ్యవసాయ మార్కెట్‌యార్డు చైర్మన్ గంధం రాఘవరెడ్డి, నాయకులు గంగిశెట్టి తిమ్మయ్య, మద్దిలేటయ్య, గంగుల రామిరెడ్డి గోపాల్‌రెడ్డి, కొల్లం పుల్లయ్య, జాకీర్, కృష్ణమూర్తి, బైరి హరి, ప్రసాద్‌రెడ్డి, నాగముణి, ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి, తహసీల్దార్ వెంకటశివ పాల్గొన్నారు.

పౌష్టికాహార కిట్ల పంపిణీ



కిట్ అందజేస్తున్న ఎంపీ పోచా

నంద్యాల(అర్బన్): క్షయ వ్యాధి ప్రాణాంతకమైంది కాదని, పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా వ్యాధి తీవ్రతను తగ్గించుకోవచ్చని నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వాసుపత్రిలో శుక్రవారం 20మందికి పౌష్టికాహార కిట్లను వైద్యాధికారులతో కలిసి అందజేశారు. జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ బాలాజీ మాట్లాడుతూ జిల్లాలోని 150 మంది క్షయ వ్యాధిగ్రస్తులను ఎంపీ ఆరు నెలల పాటు దత్తత తీసుకొని వారికి పౌష్టికాహారం కోసం రూ.4.50లక్షల చెక్కును అందజేయడం అభినందనీయమన్నారు. వైద్యాధికారులు మల్లికార్జునరెడ్డి, సునీత, సూపర్‌వైజర్ జయరామిరెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

కాళికాంబదేవికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

నంద్యాల(వ్యవసాయం): స్థానిక శ్రీ కాళికాంబ చంద్రశేఖరస్వామి దేవస్థానంలో కాళికాంబ దేవికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి మూలవిరాట్‌కు ఉదయం సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం అనంతరం పట్టు వస్త్రాలతో అలంకరించారు. అమ్మవారికి ఒడి బియ్యం కార్యక్రమాన్ని నిర్వహించి మహామంగళ హారతులు ఇచ్చారు. అనంతరం రాహుకాల పూజలు చేపట్టారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఆశీనులు గావించి ఆలయ ప్రాకారంలో ప్రదక్షిణ చేయించారు. చివరగా నవవిధ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఈఓ లక్ష్మీనారాయణ, ఆరవేటి వాసు, విజయ్‌కుమార్, నరసింహ, అంబరీష్, అర్చకులు సుబ్బాచారి, రాఘవేంద్రాచారి, సుబ్రహ్మణ్యం శాస్త్రి పాల్గొన్నారు. అమ్మవారి పల్లకోత్సవం ప్రారంభించి ఏడాది అవుతున్న సందర్భంగా ఉదయం ఉత్సవమూర్తికి ప్రత్యేక పూజలు జరిపించారు.

లోన్‌యాప్‌లపై జాగ్రత్తగా ఉండాలి

దొర్నిపాడు: లోన్ యాప్‌లను నమ్మి మోసపోవద్దని వాటితో జాగ్రత్తగా ఉండాలని డీఎస్పీ సుధాకర్‌రెడ్డి సూచించారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో పీఎస్ పరిధిలోని గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ లోన్ యాప్‌లను కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే రద్దు చేసిందన్నారు. ముఖ్యంగా యువత, విద్యార్థులు లోన్ యాప్‌ల ఆకర్షణకు లోనయ్యారని, తల్లిదండ్రులు పిల్లల పట్ల శ్రద్ధ చూపాలన్నారు. అలాగే సైబర్ నేరాలు పెరిగిపోయాయని అపరిచితులు ఫోన్ చేస్తే బ్యాంకు, ఏటీఎం, ఆధార్ వంటి వివరాలను ఇవ్వద్దని చెప్పారు. అలాగే గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటుకు గ్రామస్తులు సహకరించాలని కోరారు. సీఐ రాజశేఖర్‌రెడ్డి, ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి, జెడ్పీటీసీ శకుంతల, ఎస్ఐ తిరుపాల్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న పింఛన్ల పంపిణీ

దొర్నిపాడు: మండలంలో పింఛన్ల పంపిణీ శుక్రవారం కొనసాగింది. మండలానికి 110 నూతన పింఛన్లు మంజూరయ్యాయి. దీంతో నూతన లబ్ధిదారులకు గ్రామ వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు ఇంటింటికీ వెళ్లి పింఛన్ సొమ్ము అందజేస్తున్నారు. :డబ్ల్యూ గోవిందిన్నెలో జరిగిన కార్యక్రమంలో కన్వీనర్ సురేఖ, నాయకులు జాకీర్‌బాషా, కరీముల్లా పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

దొర్నిపాడు: జగనన్న లేవుట్ కాలనీలో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి లబ్ధిదారులకు సూచించారు. శుక్రవారం మండలంలోని గుండుపాపల గ్రామ సచివాలయంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కుడా కింద గ్రామానికి 168 గృహాలు మంజూరయ్యాయని వాటిలో 48 నిర్మాణాలు పూర్తయినట్లు చెప్పారు. లేఅవుట్‌లో నిర్మాణాలు చేపట్టేందుకు అర్హులందరికీ పట్టాలు మంజూరు చేశామని లబ్ధిదారులు వెంటనే నిర్మాణాలు చేపట్టాలని తహసీల్దార్ జయప్రసాద్ సూచించారు. ఎంపీడీఓ నాగఅనసూయ, సర్పంచ్ వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి వెంకటనారాయణ, హౌసింగ్ వర్కుఇన్‌స్పెక్టర్ బ్రహ్మయ్య పాల్గొన్నారు.

శ్రీశ్రీ కళావేదిక నూతన కార్యవర్గం ఎన్నిక

నంద్యాల(వ్యవసాయం): శ్రీశ్రీ కళావేదిక నూతన కార్యవర్గాన్ని శుక్రవారం సంస్థ స్థానిక కార్యాలయంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చైర్మన్ డాక్టర్ కత్తిమంత ప్రతాప్ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు చిలకల బాలరాజు, ఉపాధ్యక్షుడు డాక్టర్ కిశోర్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా నీలం వెంకటేశ్వర్లు, మహిళా ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ వీసీ లలిత, ఆర్గనైజింగ్ కార్యదర్శి రఫీ, నాగోషులు, మోహన్‌రావు, రత్నలక్ష్మి, హరీశ్‌లను కార్యదర్శులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

హ్యాండ్‌బాల్ జట్ల ఎంపిక

నంద్యాల(సిటీ): స్థానిక రామకృష్ణా పీజీ కళాశాల మైదానంలో హ్యాండ్ బాల్ రాష్ట్రస్థాయి బాలుర సబ్ జూనియర్ (అండర్-15), జూనియర్ (అండర్-19) జట్ల ఎంపిక పోటీలు శుక్రవారం నిర్వహించారు. హ్యాండ్ బాల్ సంఘం ప్రతినిధులు రామేశ్వరరెడ్డి, రాజ్‌కుమార్‌రెడ్డి, మహబూబ్ బాషా మాట్లాడుతూ సబ్ జూనియర్ విభాగంలో 30, జూనియర్ విభాగం పోటీలకు 40 మంది అభ్యర్థులు హాజరయ్యారన్నారు. ఉత్తమ ప్రతిభ చూపిన 16 మందిని రెండు జట్లకు ఎంపిక చేశామని చెప్పారు. ఈ నెల 13, 14 తేదీల్లో కృష్ణాజిల్లా గన్నవరంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో ఎంపికైన వారు పాల్గొంటారన్నారు. పీఈటీలు షేక్షావలి, శ్రీధర్, ఖాజా, సాయి, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం ట్రెజరర్ భుజంగరావు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో నేల సారవంతం



మాట్లాడుతున్న శాస్త్రవేత్త బాలరాజు

ఆళ్లగడ్డ: ప్రకృతి వ్యవసాయ విధానంలో పంటలను సాగు చేయడం వల్ల భూమి సారవంతం అవుతుందని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు బాలరాజు, రమణయ్య పేర్కొన్నారు. చాగలమర్రి మండలంలోని ముత్యాలపాడు గ్రామ సమీపంలో సీఎస్ఎఫ్ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ నరేంద్రారెడ్డి ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ రసాయన ఎరువులు వాడటం వల్ల భూమి సారవంతం కోల్పోతుందన్నారు. పంట వ్యర్థాలను పొలాల్లో కాల్చవద్దని, వాటిని పొలాల్లోనే కుళ్లింపజేస్తే ఎరువుగా మారుతుందన్నారు. ఏఓ రంగనేతాజీ, హార్టికల్చర్ అధికారి నరేష్ కుమార్‌రెడ్డి, సాగునీటి సంఘం అధ్యక్షుడు శేషురమేష్, ఏఈఓలు పాల్గొన్నారు.

భూ రికార్డుల స్వచ్ఛీకరణపై దృష్టి సారించండి

● జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

నంద్యాల: భూ తగాదా సమస్యలను పరిష్కరించి, భూ రికార్డుల స్వచ్ఛీకరణపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జాయింట్ కలెక్టర్ నిశాంతితో కలిసి భూ హక్కు పత్రాల పంపిణీ, మ్యుటేషన్ దరఖాస్తులు, పీఓఎల్ఆర్ రీసర్వే, జగనన్న శాశ్వత భూ హక్కు - భూరక్ష పథకం, స్పందన అర్జీలు, పౌర సరఫరాలు, 90 రోజుల ఇళ్ల పట్టాలు, కోర్టు కేసుల సత్వర పరిష్కారం తదితర అంశాలపై తహసీల్దారులు, ఆర్‌డీఓలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ భూ ఆక్రమణలు, రెవెన్యూ రికార్డులో సవరణలు, పట్టాదారు పాసు పుస్తకాల మంజూరులో లోపాలు తదితర అంశాలపై ప్రజల నుంచి అధికంగా దరఖాస్తులు వస్తున్నాయని, వీటన్నింటిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని క్షేత్రస్థాయిలో నిశితంగా పరిశీలించాలని సూచించారు. భూ రికార్డుల స్వచ్ఛీకరణకు రెవెన్యూ అధికారులు చిత్తశుద్ధితో కృషి చేయాలని, గ్రౌండ్ ట్రూతింగ్, గ్రౌండ్ వాల్యుయేషన్, సమగ్ర రీ సర్వే తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించాలని చెప్పారు. మ్యూటేషన్ కరెక్షన్స్ దరఖాస్తులకు పరిష్కారం చూపాలని, భూ రీసర్వే, ఫైనల్ ఆర్ఓఆర్ పూర్తయిన గ్రామాల్లో భూ హక్కు పత్రాల పంపిణీకి చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందన దరఖాస్తుల పరిష్కారానికి సంబంధించి 39 రీఓపెన్ దరఖాస్తులు, విత్ ఇన్ ఎస్ఎల్ఏలో ఉన్న 775 దరఖాస్తులు, ఏపీ సేవా సర్వీసులు బియాండ్ ఎస్ఎల్ఏలో ఉన్న 414 దరఖాస్తులను నిర్ణీత కాల గడువులోగా పరిష్కరించాలని పేర్కొన్నారు. జాయింట్ కలెక్టర్ టి.నిశాంతి మాట్లాడుతూ జిల్లాలోని 62 గ్రామాల్లో ఎస్సీల శ్మశాన వాటికలకు ప్రభుత్వ భూములను గుర్తించి సోమవారంలోపు ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. ప్రభుత్వ భూములు లభ్యం కాకపోతే దాతలను గుర్తించాలన్నారు. ఇళ్ల పట్టాల మంజూరుకు ఎంపిక చేసిన లబ్ధిదారులను నిబంధనల మేరకు క్షేత్రస్థాయిలో విచారించి నివేదికలను సమర్పించాలని చెప్పారు. అనర్హత కలిగిన లబ్ధిదారులకు మంజూరు చేస్తే సంబంధిత వీఆర్ఓ, తహసీల్దార్లను బాధ్యులను చేసి కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. జాతీయ రహదారులు 340సి, 340బి, 167లకు సంబంధించి భూసేకరణ ప్రక్రియ వెంటనే పూర్తి చేయాలని సూచించారు. డీఆర్ఓ పుల్లయ్య, డోన్ ఆర్‌డీఓ వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అష్టోత్తర శత కలశాభిషేకం





వేంకటేశ్వరస్వామికి క్షీరాభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం, 108 కలశాలకు పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): సంజీవనగర్ రామాలయంలోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామికి ధనుర్మాసాన్ని పురస్కరించుకొని భగవత్ సేవా సమాజ్ ఆధ్వర్యంలో శుక్రవారం అష్టోత్తర శత కలశాభిషేకం వైభవంగా నిర్వహించారు. అర్చకులు శ్రీకాంత్‌శర్మ ఆధ్వర్యంలో 108 కలశాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారి మూలవిరాట్‌కు అష్టోత్తర శత కలశాభిషేకాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం గంధాభిషేకం, ప్రత్యేక పూజలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. అలాగే ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు చేపట్టి పట్టువస్త్రాలతో అలంకరించారు. చివరగా మహామంగళ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి



ఈ-క్రాప్ నమోదును పరిశీలిస్తున్న డీఏఓ మోహన్‌రావు

దొర్నిపాడు: ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాలు వర్తించాలంటే రైతులు తప్పనిసరిగా ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు సూచించారు. శుక్రవారం మండలంలోని గుండుపాపల గ్రామంలో జరుగుతున్న ఈ-క్రాప్ నమోదు కార్యక్రమాన్ని పరిశీలించి స్థానిక వైఎస్సార్ రైతు భరోసా కేంద్రంలో నిర్వహించిన గ్రామ వ్యవసాయ సలహా మండలి సమావేశంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ రబీలో సాగుచేసిన పంటలకు ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలని చెప్పారు. అర్హత ఉండి పీఎం కిసాన్ నగదు జమ కానీ రైతులు ఈనెల 15 తేదీలోగా ఈ-కేవైసీ చేయించుకోవాలని తెలిపారు. ఏపీసీఎన్ఎఫ్ ద్వారా సాగు చేసిన శనగ పంటను పరిశీలించారు. జిప్సం, జింక్, టార్పలిన్ పట్టలను రాయితీ రూపంలో ఇవ్వాలని రైతులు కోరడంతో ఉన్నతాధికారులకు నివేదికలు పంపుతామన్నారు. అనంతరం ఆయన రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఏఓ శ్రీకృష్ణ, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ సారథి పాల్గొన్నారు.





లాంగ్ జంప్ చేస్తున్న విద్యార్థి, పరుగు పందెం విజేతగా నిలిచిన ఈఎస్‌సీ ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యార్థిని సంగీత

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

నంద్యాల(సిటీ): విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస ప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఈఎస్‌సీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 25వ జిల్లా స్థాయి క్రీడలు రెండో రోజు కొనసాగాయి. కాగా..స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో షాట్‌పుట్, 100, 200, 400, 800 మీటర్ల రన్నింగ్, లాంగ్ జంప్, జావెలిన్ త్రో, వాలీబాల్, డిస్కస్‌త్రో తదితర పోటీలు జరిగాయి. ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పాలిటెక్నిక్ కళాశాలల నుంచి సుమారు 405 మంది విద్యార్థులు వివిధ క్రీడల్లో పాల్గొన్నారని చెప్పారు. శనివారం జరగనున్న ఫైనల్ పోటీల అనంతరం విజేతలకు బహుమతులు అందజేస్తామని తెలిపారు.

శాంతి, అభివృద్ధే లక్ష్యం

నంద్యాల(అర్బన్): సమాజంలో శాంతి, స్నేహం, అభివృద్ధి లక్ష్యాలుగా ఇస్కఫ్ (భారత సాంస్కృతిక సహకార స్నేహ సంఘం) పని చేస్తుందని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింహులు తెలిపారు. శుక్రవారం స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో సంఘం జిల్లా సమావేశం నిర్వహించారు. నంద్యాల జిల్లా కార్యదర్శి మౌలానా మాట్లాడుతూ విలువలతో కూడిన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకునేందుకు అన్ని వర్గాల ప్రజలు సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు బాబాఫక్రుద్దీన్, సోమన్న, పాల్గొన్నారు. అనంతరం ఇస్కఫ్ నూతన జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కన్వీనర్‌గా సుబ్బరాయుడు, సభ్యులుగా మౌలానా, తిరుపతయ్య, నీలకంఠమాచారి, శ్రీనివాసరెడ్డి, జయప్రకాష్, వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు.

ఫ్యాప్టో జిల్లా కార్యవర్గం ఎన్నిక



సంఘీభావం తెలుపుతున్న నాయకులు

నంద్యాల(సిటీ): ఫ్యాప్టో (ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ టీచర్స్ ఆర్గనైజేషన్) జిల్లా కార్యవర్గ సభ్యుల ఎన్నిక శుక్రవారం జరిగింది. స్థానిక ఏపీటీఎఫ్ (ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్) కార్యాలయంలో జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా ఫ్యాప్టో రాష్ట్ర కో చైర్మన్ ప్రకాష్‌రావు హాజరయ్యారు. నంద్యాల జిల్లా చైర్మన్‌గా భేరి మాధవస్వామి (ఏపీటీఎఫ్), జనరల్ సెక్రటరీ మేకల సుబ్బన్న(ఎస్సీఎస్టీయూఎస్), కో చైర్మన్‌లు కిషోర్(డీటీఎఫ్), జమాన్(రూటా), డిప్యూటీ సెక్రటరీ జనరల్‌గా పీవీ. ప్రసాద్(యూటీఎఫ్), అజామ్‌బేగ్(ఎస్టీయూ), శివయ్య(ఏపీటీఎఫ్), జిల్లా కార్యదర్శి ఎస్ఎండీ రఫీ(ఆప్టా)ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

మరకత లింగేశ్వరుడికి అన్నాభిషేకం



మహానంది: గాజులపల్లె రైల్వేస్టేషన్ గ్రామంలో వెలిసిన శ్రీ గంగాగౌరీ సమేత మరకత లింగేశ్వరస్వామికి జన్మనక్షత్రం ఆరుద్ర సందర్భంగా శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు కనమర్లపూడి మస్తాన్ రావు ఆధ్వర్యంలో అర్చకులు, పండితులు స్వామివారికి అన్నాభిషేకం నిర్వహించారు.

చౌడేశ్వరీదేవికి పల్లకీ సేవ

బనగానపల్లెరూరల్: మండలంలోని నందవరం గ్రామంలో వెలసిన శ్రీ చౌడేశ్వరీదేవి అమ్మవారికి పౌర్ణమి సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం ఆలయ ఈఓ రామానుజన్ ఆధ్వర్యంలో శ్రీ చౌడేశ్వరీదేవి అమ్మవారికి కుంకుమార్చన, అభిషేకం తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి అమ్మవారి పల్లకీ సేవ, సహస్రదీపాలంకరణ సేవ ఘనంగా నిర్వహించారు.



అమ్మవారికి సహస్రదీపాలంకరణ సేవ చేస్తున్న దృశ్యం





క్రీడాకారుడికి నగదును అందజేస్తున్న ఎమ్మెల్యే గంగుల, పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గంగుల

దేశానికి పేరు తేవాలి

ఆళ్లగడ్డ: అంతర్జాతీయ పోటీల్లో దేశానికి పేరు తేవాలని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి ఆకాంక్షించారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో చాగలమర్రికి చెందిన షాహిద్ అనే క్రీడాకారుడు అంతర్జాతీయ బేస్‌బాల్ పోటీలకు ఎంపిక కావడంతో ఖర్చుల నిమిత్తం ఎమ్మెల్యే రూ.లక్ష ఆర్థిక సాయం అందజేశారు. వచ్చే నెల 27న పాకిస్తాన్‌లోని ఇస్లామాబాద్‌లో జరిగే అంతర్జాతీయ బేస్ బాల్ పోటీల్లో భారత జట్టులో ఆడనున్నాడు. పోటీల్లో మంచి ప్రతిభ కనబరిచి భారత జట్టు విజయానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్‌బాబులాల్, బేస్‌బాల్ సంఘం జిల్లా కార్యదర్శి సుబ్బయ్య, మండల కో ఆప్షన్ సభ్యుడు ఇబ్రహీం పాల్గొన్నారు.

ప్రచార పోస్టర్ ఆవిష్కరణ..

పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా వెన్నపూస రవీంద్రారెడ్డి పోటీ చేస్తున్న సందర్భంగా శుక్రవారం ప్రచార పోస్టర్‌ను ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి ఉపాధ్యాయులు, న్యాయవాదులతో కలిసి ఆవిష్కరించారు. రవీంద్రారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

ప్రజా ప్రదర్శనకు అనుమతి ఇవ్వండి



ఎస్పీకి వినతిపత్రం అందజేస్తున్న రాయలసీమ స్టీరింగ్ కమిటీ సభ్యులు

నంద్యాల(రూరల్): ఈ నెల 28వ తేదీన కొత్తపల్లి మండలం సిద్ధేశ్వరం వద్ద రాయలసీమ స్టీరింగ్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రజా ప్రదర్శనకు అనుమతి ఇవ్వాలని నంద్యాల జిల్లా ఎస్పీ రఘువీరారెడ్డికి కమిటీ సభ్యులు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. అనంతరం కమిటీ సభ్యులు కామని వేణుగోపాల్‌రెడ్డి, కృష్ణ, శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ రాయలసీమ కరువు శాశ్వత నివారణకు కృష్ణ, తుంగభద్ర నదుల నీరు కీలకమన్నారు. ఈ రెండు నదులు కలిచేచోటు సంగమేశ్వరమని, కేంద్ర ప్రభుత్వం జాతీయ రహదారుల నిర్మాణంలో భాగంగా167-కె జాతీయ రహదారి సిద్ధేశ్వరం వద్ద నిర్మిస్తున్న తీగల వంతెనకు బదులు, బ్యారేజ్ కం వంతెనను నిర్మించాలని ప్రజాప్రదర్శన నిర్వహిస్తున్నామని చెప్పారు. బ్యారేజి కం వంతెన నిర్మిస్తే రాయలసీమకు సాగు, తాగు నీరు అందుతుందన్నారు. సీమకృష్ణ, బజారి, హరినాయుడు పాల్గొన్నారు.

హరికిషన్‌కు బాల సాహిత్య రచన పురస్కారం



డాక్టర్ హరికిషన్‌కు పురస్కారం అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

నంద్యాల(వ్యవసాయం): కర్నూలుకు చెందిన డాక్టర్ ఎం.హరికిషన్‌కు సరిలేరు నీకెవ్వరు విశిష్ట బాల సాహిత్య రచన పురస్కారం, రూ.25వేల నగదును అజో విభో కందాలం ఫౌండేషన్ వ్యవస్థాపకులు అప్పాజోష్ల సత్యనారాయణ, కళారాధన అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ మధుసూదనరావు, డాక్టర్ రవికృష్ణ అందజేసి ఘనంగా సత్కరించారు. స్థానిక టౌన్‌హాల్‌లో రాష్ట్ర స్థాయి సాహితీ నాటకోత్సవాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం కడప సాహితీవేత్త తవ్వా వెంకటయ్య, కర్నూలు సాహితీవేత్త ఉమామహేశ్వరరావు ప్రధాన వక్తలుగా పాల్గొని డాక్టర్ హరికిషన్ సాహిత్య కృషిపై ప్రసంగించారు. అనంతరం రంగస్థల కళాకారులకు అందజేసే రూ.10వేల విశిష్ట రంగ స్థల జీవిత కాల పురస్కారం ప్రముఖ మేకప్ కళాకారుడు పట్టణానికి చెందిన శ్రీనివాసమూర్తికి, సురభి నాటక కళాకారిణి శారదా బాయికి అందజేశారు. వారు మాట్లాడుతూ నాటకం సజీవ కల అని, ఈ నాటక ప్రదర్శనలు సాహితీ సాంస్కృతిక కార్యక్రమాలు నంద్యాలలో ప్రతి నెల మూడో ఆదివారం సాయంత్రం నిర్వహించాలని నిర్ణయించామని తెలిపారు.

అలరించిన నాటక ప్రదర్శనలు...

కేఎల్ స్వామి ప్రదర్శించిన 'కొత్త పరిమళం' సాంఘిక నాటిక, భాస్కర చంద్ర రచించిన 'అగ్నిసంస్కారం' నాటికలు ప్రేక్షకులను అలరించాయి. శనివారం ప్రేమతో నాన్న, థ్యాంక్స్ ఫర్ ద పీఎం సాంఘిక నాటక ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

గోస్పాడు పీహెచ్‌సీలో విజిలెన్స్ అధికారుల తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

గోస్పాడు: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి తిరుమలేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో జరుగుతున్న వైద్యసేవలు, సిబ్బంది ముఖ ఆధారిత అటెండెన్స్‌ను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా సౌకర్యాలను కల్పిస్తూ పేద ప్రజలకు నాణ్యమైన వసతులు కల్పించేలా ఆసుపత్రులను తీర్చిదిద్దుతుందన్నారు. రోగులకు అందుతున్న వైద్య సేవలు, అందుబాటులో ఉన్న వైద్య సిబ్బందిపై ఓపీకి వచ్చిన రోగులతో మాట్లాడి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో నాడు-నేడు కింద జరుగుతున్న అభివృద్ధి పనులపై ఆరా తీశారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ మీటింగ్ మినిట్స్ రిజిస్టర్, ముఖఆధారిత అటెండెన్స్, మూమెంట్ రిజిస్టర్లను తనిఖీ చేశారు. మందుల నిల్వలు, వాటి ఖర్చుకు సంబంధించిన స్టాక్ రిజిష్టర్లు, రికార్డులు, ల్యాబ్‌పరీక్షలు, అందుకు సంబంధించిన, ఇన్‌పేషంట్ల రికార్డులు పరిశీలించారు. వైద్యాధికారులు కాంతరావునాయక్, గోపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు బ్లాక్ స్పాట్‌ల గుర్తింపు



సిబ్బందికి సూచనలిస్తున్న డీఎస్పీ మహేశ్వరరెడ్డి

బొమ్మలసత్రం: రోడ్డుప్రమాదాల నివారణకు నంద్యాల -కడప జాతీయ రహదారిపై నంద్యాల శివారులో బ్లాక్‌స్పాట్‌లను డీఎస్పీ మహేశ్వరరెడ్డి శుక్రవారం గుర్తించారు. బ్లాక్‌స్పాట్‌ల వద్ద హెచ్చరికలు, తాత్కాలిక డివైడర్‌లను ఏర్పాటు చేసిన అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతంలో స్పీడ్ బ్రేకర్లు, ఎస్ మార్కులో బారికేడ్లు ఏర్పాటు చేశామన్నారు. ఫొటోలతో కూడిన బోర్డులు, ప్రమాద సూచికలు ఉంచామని చెప్పారు. కుందూ బ్రిడ్జి, వెంకటేశ్వరాపురం ఫ్లై ఓవర్ సమీపంలో, శాంతిరామ్ ఆసుపత్రి ఎదుట, చాబోలు మెట్ట ఎక్స్ రోడ్, అయ్యలూరు మెట్ట జంక్షన్, విజయా మిల్క్ డెయిరీ ఎదుట, చిన్న చెరువు కట్ట ప్రాంతాల్లో సూచికలు ఏర్పాటు చేశామని వివరించారు. ట్రాఫిక్ సీఐ నరేషబాబు, తాలుకా ఎస్ఐ గంగయ్యాయాదవ్ పాల్గొన్నారు.